కథానిక :




కొత్తగా ప్లీడరీప్రాక్టీసు పెట్టబోతున్న మా బావమరది రెండురోజులు ఊరంతా తిరిగి, ఇల్లు తన మనస్సులో నిశ్చయంచేసుకొనివచ్చి నన్ను ముందుగా ఒకపర్యాయం చూడ మన్నాడు.

ఇంకా మేము వీధిచివరనే ఉండగా "చూసేవుకదూ, ఆ పచ్చ మేడకి ఎదురుగా ఉన్న ఎత్తరుగుల పెంకుటిల్లు. అదే" అన్నాడు.

"అదేనా, అదయితే మరి నేను చూడ నక్కరలేదు. నువ్వు ఈ ఊళ్లో ఉన్నంతకాలం లోనూ, ఎన్నడయినా నేను నీయింటికి రావా లంటే, మరొక అయిదురూపాయిలు ఎక్కు వయినాసరే వేరే ఇల్లు తీసుకో" అని వెనక్కి తిరిగేను.

మావాడికి కష్టం తోచిఉంటుంది. "నీకా ఇల్లు తెలుసునేమిటి?" అని నా సమాధానం కోసం ఆగకుండానే, "అయినా నువ్వెప్పుడో చూసిఉంటావు. ఈమధ్యనే మరమ్మత్తులూ అవీ చేయించేరు. అదివరకు రెండుమూడు చిన్న చిన్న కుటుంబా లుండేవిట; ఇప్పుడు మన ఒక్కరికే ముప్ఫైఅయిదురూపాయిలకి ఇచ్చేస్తున్నా" రంటూ అయిష్టంగా తాను వెనక్కి తిరిగేడు.

నాకు మరి వాడు చెప్పేమాటలు ఏవీ విని పించుకోవా లనిపించలేదు. "నీకు ఇంకొక ఇల్లు వెతుక్కొండికి కష్టంగా ఉంటే, నాలుగురోజులు నా పని మానుకొనిఅయినాసరే, తిరిగి ఏదో ఒకటి కుదిర్చి పెడతానులే, అంతేకాని మరి ఈ ఇంటి సంగతిమాత్రం చెప్పకు" అన్నాను.

మావాడూ తక్కువవాడు కాడు. "పోనీ ఒక్కమారు ఆ ఇల్లంతా చూడకూడదా" అన్నాడు ఆఖరి ప్రయత్నంగా నేను ఆయింటి మీద అకారణంగా అపోహ పెట్టుకొన్నా నేమో నని.

నాకు మరి ఆవిధంగా రోడ్డుమధ్యకి నిలబడి చర్చచేయడం చికాకనిపించింది. "నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు, ఆ యింట్లో నువ్వు ఉండే మాటయితే నేను రావడంమాత్రం జరగదు. అందుకు నాకూ తగిన కారణం లేకపోలేదు. కావాలంటే, పోయి ఇంటిదగ్గర చెప్పు కొందాము" అన్నాను.

మేము ఇంటికి వెళ్లి వెళ్లడంతోనే మాఆవిడ వాళ్ళ అన్నయ్యను అడిగింది: "ఏమిటి చేసు కొని వచ్చేరు? మీ బావగారికి నచ్చిందా" అనిటీ మరుగుతున్న నీళ్లలో వేస్తూ.

నిస్పృహగా కుర్చీలో కూలబడుతూ "ఉఁహుఁ మళ్లీ మొదటికి వచ్చింద"న్నాడు మా బావమరది.

ఆవిడ కుర్చీలో కూర్చుని అంది: "నాకు మొదటే తెలుసును ఆయనకి నచ్చదని. వైద్యుణ్ణి కూరలు కొనడానికి పంపిస్తే, ఏ కూరా నచ్చక చివరకి తిప్పతీగ కొనుక్కొని వచ్చేడట. ఆ విధంగా ఆయనకి ఏ ఇల్లూ నచ్చదు. తానంటే ఇప్పటికి ఏదో ఇల్లు కట్టించుకొన్నారుగనక, ఇక అందరి ఇళ్లూ అమాత్రంగానైనా ఉండక పోతే వీలే దంటారు. అసలు ఇప్పుడు ప్రజలకి వస్తున్న జబ్బుల్లో నూటికి తొంభైశాతంకులు గాలీ వెలుతురూ సరిగా రాని ఇరకటపు ఇళ్లమూలంగానే వస్తున్నాయట."

"అంత అందరూ మంచి ఇళ్ళల్లో పరిశు భ్రంగా ఆరోగ్యంగా ఉంటే, మరి ఈ డాక్టర్ల అవసరమే ఉండదు" అన్నాడు మా బావమరిది.

"అవునయ్యా! అదే నేను కావాలనేది. ప్రజ లకు జబ్బులు లేకుండా ఉంటే నా అవసరం ఉండదు. తగాదాలు లేకుండా ఉంటే, నీ పని ఉండదు. అయితే అటువంటి స్థితి ప్రపంచంలో ముఖ్యంగా మన దేశంలో ఎప్పుడు వస్తుందో, అసలు రానేరాదో..."

ఇంకా నా మాట పూర్తికాకుండానే లేచి టీ కలుపుతూ ఆవిడ, "ప్రపంచంమాట దేము డెరుగు, ముందు ఇంటి సంగతి చెప్పరూ" అంది.

## శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

"చెప్పడాని కేముంది, నాకా ఇల్లు నచ్చ లేదు" అన్నాడు.

"ఎందుచేత నచ్చలేదో, కొళాయీ, సుయ్యా కూడా ఉన్నాయట. ఎలక్ట్రిసిటీ ఉందిట. ముందు పెద్దహాలుందిట. పూర్వకాలపు ఇల్ల యినా కొత్తగా మరమ్మత్తులు చేయించేరట."

అంతలో మా బావమరిది "అసలు ఇల్లంటూ చూస్తేగదూ, వీధిచివరనుండి ఫలానా ఇల్లు అని చూపించడమే నాది పొరపాటు" అన్నాడు.

ఆవిడ పెదవివిరిచి, "అయితే ఇంతా ఇల్లు చూడకుండానేనా?" అంది.

నాకు మరి ఊరుకోబట్టింది కాదు. "నీకూ మీ అన్నయ్యకీ అంతగా ఆ యిల్లే కావాలనుంటే వద్దనడానికి మధ్యను నే నెవర్ని. కేవలం, తర వాత నామీద నిష్ఠురం వెయ్యకుండా ఉండడా నికి, నేనుమాత్రం ఆ యింటికి రాలే నన్నాను. అంతే. నా కారణాలు నాకూ ఉన్నై" అన్నాను.

"అవునవును, అవేమిటో ఇంటిదగ్గర చెప్తా నన్నావు" అన్నాడు మా బావమరిది అప్పుడే నిద్రనుంచి లేచినట్లుగా.

"నేను చెప్పాలనే అనుకొంటూఉంటే మీ రిద్దరూ భళాభళి అని ఒకరి తరవాత ఒకరు మాట్లాడుతూ నాకేమయినా సావకాశంఅంటూ ఇస్తేకదూ" అన్నాను.

అప్పటికి కొంచెం సద్దుబాటుమార్గానికి వచ్చి మా బావమరది "మరి నేనూ మాచెల్లెమ్మా ఏమీ మాట్లాడం, ఆ చెప్పేదేదో ఇప్పుడు చెప్తావా?" అన్నాడు.

"నేనేం చెప్ప ననడంలేదు. పద తోటలో పోయి కూర్చుందాము. అక్కడికే శారద టీ తెచ్చేస్తుంది" అన్నాను.

టీ తీసుకొన్నాక "శారదా! నీతో రెండు మూడుమార్లు లోగడ చెప్పాలనుకొనికూడా చెప్పడం కాలేదు. నువ్వూ కూర్చో వింటువు గాని" అన్నాను.

ఆమె "అంతకంటేనా, ఒక్కక్షణం ఆగండి. నా అల్లిక తెచ్చుకోని వస్తా"నంది.

ఆలోపున నేను సిగరెట్టు ముట్టించి, కొద్దిగా కాల్చి, మధ్యలో అడ్డంకిగా ఉండకుండా పారేసి, పడకకుర్చీలో వెనక్కి చేరబడి చెప్పడం మొదలుపెట్టేను. చెప్పడం మొదలు పెట్టినతర్వాత నా కళ్లు తెరిచిఉన్నానో మూసుకొనిఉన్నానో తెలుసుకోవడం ఇప్పుడు నాకూ కష్టమే. కాని, నాకు కనిపించి నదిమాత్రం ఎట్టఎదురుగా ఉన్న చెట్లకొన కొమ్మలూ ఎగిరే పక్షులూ కాదన్న దిమాత్రల నిర్వివాదాంశం.

* * *

నేను నా పదిహేనవ ఏట స్కూలుఫయినలు పాసయేను. అంతవరకూ మా చిన్నాన్నగారి ఊళ్ళోనే గడిచిపోయింది. అప్పుడు ఇంటర్మీడి యేటుకి ఈ ఊరు వచ్చేను. అప్పుడు నా బస ఎక్కడో తెలుసునా, ఇందాకా నువ్వు చూపిన ఆయింట్లోనే.

ఉఁహుఁ మరి నువ్వేమీ మాట్లాడకు నన్ను సాంతం చెప్పనీ.

అప్పుడు నేను నా వయస్సుకి తగినంత ఒడ్డు పొడవులతో ఉండేవాణ్ణి కాను. అందరూ నాని జమయిన వయస్సుకి రెండేళ్లు తక్కువగానే ఊహించేవారు. ఒక్క ఒడ్డుపొడవుల్లోనే కాదు. తక్కినవిషయాల్లోకూడా నాయీడు విద్యార్థులకంటె చాలా వెనకబడి ఉండేవాణ్ణి. ఒక్క స్కూలు మార్కులలో తప్ప. వాటిలోనూ మొదటిమార్కులు ఎప్పుడూ లేదుగాని, మొట్ట మొదటి ముగ్గురు నలుగురు విద్యార్థులలోమా లెక్కకి వచ్చేవాణ్ణి. కాక, మరీ చిన్నవాడులాగా కనిపించడంమూలానకూడా లెక్చరర్లకీ తోటి విద్యార్థులకీ నేనంటే చాలా అభిమానం.

ఇంటికి వెనకభాగంలో ఒక డాబా. అంది మీద పిచ్చికగూడులాగా ఒక చిన్నగది. అది నా గది. దానికి నెలకి మూడురూపాయిలు అద్దె ఇచ్చేవాడిని. 'అనూలసౌధంబుదాపల అన్నట్లు అన్ని వరండాలూ ద్వారాలూ దాటుకొని ఆ లోపలికి ఎందు వెళ్తాడయ్యా' అంటూ ఉండే వారు ఉన్న కొద్దిమంది స్నేహితులున్నూ. నాకు కావలసిందీ అదే. కాక అప్పుడు నాకింకొకగర్వ ముండేది, నా స్నేహితులు పేరుకూడా వినని ఎన్నెన్నో పుస్తకాలు చదివేనని. అప్పటికి కాలేజీలైబ్రరీలోనూ మునిసిపల్ లైబ్రరీలోనూ ఉన్న ఇంగ్లీషు నవలలలో నేను చదవనిది ఒక్కటిలేదు.

ఈ నా ఎల్లప్పుడూ చదువుకొనే అలవాటు వల్లనయితేనేమి, అదివరకుండే కుఱ్ఱవాళ్లలాగా నాగురించి పదిమంది స్నేహితులు వచ్చి గోల చెయ్యకపోవడంవల్లనయితేనేమి, నేనయినా ఎంతో మంచి ఫిలిమయితే మొదటి ఆటకి వెళ్లడం తప్ప, మామూలువిద్యార్థులలాగా తరుచు రెండవ ఆటకి వెళ్లి నడిరాత్రప్పుడు తలుపు తెరవ మని గోలచెయ్యకపోవడంవల్లనయితేనేమి, మొత్తంమీద ఆ యింటిలో ఉండే మూడు కుటుంబాలవారికీ నేనంటే చాలా అభిమానం గానూ, గౌరవంగానూ కూడా ఉండేది. తరచు వాళ్ళ వాళ్ళ పిల్లలకి బుద్ధిచెప్పే సందర్భాలలో, నన్నొక ఆదర్శవిద్యార్థిగా లెక్కించి, "మాడు మేడమీద భూషణం, ఎప్పుడు భోజనానికి వెళ్తాడో ఎప్పుడు వస్తాడో, కాలేజీ ఉన్న రోజుల్లో తిన్నగా కాలేజీకి వెళ్ళివస్తాడు. అంతే. మరి ఒకళ్ళజోలీ శొంక్యం తన కక్కర లేదు. అలా తన మానాన తను కూర్చొని చదువు కొంటాడు. అదీ బాగుపడేవాళ్ల లక్షణం" అంటూ ఉండేవారు.

ఇదంతా ఎందుకు చెప్పవలసివస్తున్నాదంటే, నేను అని మొదలుపెట్టి నా కథ చెప్తాంటేన అప్పుడూ ఇప్పుడూ ఒక్కలాగే ఉన్నాను కొంటారేమోనని. నిజానికి అప్పటి నా అశక్తినీ, ఒంటరితనాన్నీ తలుచుకొంటూఉంటే, ఇప్పుడు నాకు చికాకుగానే ఉంటుంది. సరే ఏదయితే నేం. జరిగినదేదో ఫలావారకంగా జరిగిందని చెప్పకోవడంకంటె మనం చేయగలిగింది ఏమీ లేదు.

అట్టే డొంకతిరుగుడు లేకుండా అసలువిష యానికే వస్తున్నాను.

అవతల తాను ఎన్ని ఇబ్బందులుపడిఅయినా సరే, మా చిన్నాన్న నాకు పుష్కలంగానే డబ్బు పంపించేవాడు. అంటే ఒకటి, కాలేజీ జీతమూ, హోటలుకి ఇవ్వవలసినదీ కాక, ఎక్కువ ఎంతఅయినా నాకు ఎక్కువ అన్నట్లు గానే ఉండేది. ఆ యింటిలోని ముగ్గురు గృహ స్థులూ అప్పుడప్పుడు నాదగ్గర రెండూ, మూడూ, అయిదూ చొప్పున పదిలోపుగా వాడుకొంటూ ఉండడమూ, మళ్లీ వీలునిబట్టి తీర్చేస్తూఉండ డమూకూడా అంత అరుదైన సంగతి కాదు.

అప్పుడు ఇంటర్మీడియేటు పరీక్షకి డబ్బు కట్టవలసిన రోజులు. పరీక్షడబ్బూ, కాలేజీకి కట్ట వలసిన జీతమూ, సైన్సులేబరేటరీలో నాచేత పగిలిన రెండుమూడు వస్తువుల ఖరీదూ, రైలులో పోయిన ఒక లైబ్రరీపుస్తకంఖరీదూ, అంతా మొత్తం అరవైఎనిమిదిరూపాయిలు కట్టవలసి వచ్చింది. అదివరకు ఎప్పుడో మా చిన్నాన్న పంపినబాపతు నా దగ్గర మిగిలిఉన్నవి ఇరవై రెండే రూపాయిలు.

మా చిన్నాన్నదగ్గరనుండి, ఉత్తరం డబ్బూ రానన్నాళ్లూ, ఇంకా రేపు వస్తుంది ఇవాళ వస్తుంది అని ఎదురుచూసేవాణ్ణి ఎందుకయినా మంచిదని రెండురోజుల కొక ఉత్తరం రాసి పడేస్తూ. చివరికి, మా మూలు తేదీయేకాక, ఫైనుతో యూనివర్శిటీకి డబ్బు కట్టవలసిన రోజు కూడా సమీపించింది. మరి ఆలస్యం చెయ్య డానికి వీలులేదు. నా స్వైరు అందడమే తడ వుగా టెలిగ్రాము మనియార్డరు వస్తుందను కొన్నాను. కాని, నేను పోస్టాఫీసునుండి ఇంటికి వచ్చేసరికి అంతకు మూడురోజుల క్రితం మా పొరుగింటి ఆయన రాసిన ఉత్తరం వచ్చి ఉంది. మా చిన్నాన్న బ్రహ్మాండమయిన జబ్బుతో, ఏమిటో వివరాలులేవు. బాధపడు తున్నాడనీ, అంతకాలం నేను గాభరాపడతా నేమోనని తెలియచేయవద్దన్నాడనీ, ప్రస్తుతం ఎక్కడలేని డబ్బూ ఆయన మందుఖర్చులకీ, డాక్టర్ల రాకపోకలకీ చాలటంలేదనీ, ఒకవారం పదిరోజులు గడువిమ్మని కోరవలసిందనీ, లేదా నేనే ఏవోవిధంగా సర్దుబాటుచేసుకోవలసిందనీ ఆ ఉత్తరంసారాంశం.

నాకు విచారమూ, ఆశ్చర్యమూ, నవ్వు అన్నీ కలిగేయి ఆ ఉత్తరం చూడడంతోనే.

ఏమిటి చెయ్యడం! అక్కడికి వెళ్లి చెయ్య గలిగింది లేశమాత్రమూ లేదు. కాక, ముందు ఈ డబ్బంటూ ఏదోవిధంగా కట్టేస్తే, తరవాత అక్కడికి వెళ్ళి ఒక నాలుగురోజులుండి అక్కడే చదువుకొంటూ ఉన్నా బాధ లేదు అనిపించింది.

ఇంటిలో నాదగ్గర చిల్లరమల్లరతిప్పలు తీసుకొన్న గృహస్థులు తీర్చిఉంటే మరొక ఇరవైనాలుగు రూపాయిలు చేరిఉండేవి. కాని అదేమిఖర్మమో వేళకి అందరూ అతివిచారాన్ని సూచించేవారేకాని, ఒక్కరూ ఒక్క దమ్మిడీ అయినా ఇవ్వలేదు. మరొక్క వారం రోజులు పోతే వందరూపాయిలయినా ఇవ్వగలనని ఒకాయనా, అయ్యయ్యో నిన్న కాదు మొన్ననే ఒకరికి పదిహేనురూపాయిలు ఇచ్చేసేను. అప్పుడే తెలిసిఉంటే ఎంతబాగుండు నని ఒకాయనా, ఏం, ఉంటే నీకేం ఉచితార్థం ఇవ్వాలా అని ఇంకొకఆయనా ఇల్లా ఏదో ఒక పద్ధతిని అందరూ అన్ని కారణాలు చెప్పేరు. నిజమే అయుండవచ్చును వాళ్ల కారణాలు. కాని, నాకు మాత్రం వాళ్ళంతా కక్షకట్టి ఏదో ఘోరమైన అన్యాయం చేస్తున్నట్లు కనిపించేరు అప్పటి ఉడుకుబోతుతనంలో.

ఎవరినయినా తోడివిద్యార్థుల నడగడం ఒక్కటే మిగిలిఉంది. కాని, అందరికీ అవసర మయిన సమయమే. కాకపోయినా అంత డబ్బు ఒక్కమారు ఎవరియ్యగలరు. అయినా మూడు నాలుగు చొప్పునయినా అడిగి, సేకరించా లని పించింది లీలగా మనస్సులో. కాని, ఎంచేతో

(18 పేజీ-చూడుడు)

# ఆ యిల్లు

(8-వ పేజీ తరువాయి)

ఆ సాయంత్రం ఆ పనిమీద కదలలేకపోయేను.

ఏమిటి ఆలోచిస్తున్నానో నాకే నిశ్చయంగా తెలియకుండా డాబామీద పడకకుర్చీలో పడుకొన్నాను. రాత్రి హోటలుకి భోజనానికి వెళ్లాలన్న విషయమే స్ఫురణకి రాలేదు. ఎప్పుడు నిద్రపట్టిందో కూడా తెలీదు.

ఆనాటి నిద్రలో కలలువచ్చేయో లేవో చెప్పలేనుకాని, మెలకువవచ్చినతరవాత కనిపించిన దృశ్యాలూ, జరిగిన సంఘటనామాత్రం ఈనాటికీ కలలగానే కనిపిస్తాయి. కలలయినా అంతటివి ఎప్పుడో తప్ప, తరచుగా వస్తాయనుకోను.

ఆమె మెత్తనిచేయి నా చేతిని తగలడంతో మెలకువ వచ్చింది. అప్పుడు తెల్లవారుజాము మూడో నాలుగో అయి ఉంటుం దనుకొంటాను. ఎంచేతంటే అది కృష్ణపక్షం; ఆవేళ తిథి దశమి. అల్లంత ఎత్తున ఉన్న చంద్రవంక వెలుగు రేకలు ఆమె మొగంమీద, ముఖ్యంగా కళ్లలో పడి నాకళ్లలోకి ప్రతిఫలిస్తున్నాయి. ఆ అప్పుడే నిద్రలేచిన ప్రశాంతిలో, ఆమెగాని మాట్లాడకుండా చల్లగా వెళ్లిపోయి ఉంటే, మళ్లీ నేను నిద్రలో మునిగి రాత్రి కలలో ఎవరో దేవతామూర్తిని చూసే ననుకొని ఉండును.

ఆమె ఎక్కువ మాట్లాడలేదు. "నాకు మా అత్తయ్య తను చచ్చిపోయేముందు ఎవ్వరికీ తెలియకుండా ఇచ్చింది. ఇందులో నలభై అయిదురూపాయిలున్నాయి తీసుకోండి, మీ కిప్పు డవసరంగా ఉన్నట్టున్నాయి" అంటూ నాచేతికి ఒక చిన్న బార్లీ గుండడబ్బాను అందించి, "చాలునా?" అంది తన చిటికెనవ్రేలికున్న ఉంగరంవంక చూస్తూ.

"చాలునుగాని, ఎందుకూ, మీరు మళ్లీ తిరిగి ఇవ్వడానికి..."

అంటూఉండగా ఆమె వారించి, "ఇవ్వకపోయినా మరేం బాధ లేదు లెండి, నేను వెళ్తాను. ఎవళ్ళయినా వస్తారు" అంటూ డాబామెట్లు మీంచి దిగినట్లు కాకుండా జర్రున జారినట్లుగా వెళ్ళిపోయింది.

ఆమె ఎలా వచ్చిందో, నన్ను లేపడానికి ముందు ఎంతసేపు అల్లా నిలబడి ఉందో తెలియదు. వెళ్ళిపోవడాన్ని ప్రత్యక్షంగానే చూసినా ఏమో అతిలోకస్వాప్నికవృత్తాంతం లాగే తోచింది. అయితే ఆమె నాచేతికి అందించిన డబ్బామాత్రం ఎటువంటి సందేహానికీ తావియ్యలేదు. అందులో ఒక సన్నని సిల్కుగుడ్డతో చుట్టబడి ఉన్నాయి నోట్లు. వాటిని మరి లెక్కపెట్టాలనిపించలేదు. ఇప్పటికీ, ఆ రూపాయిలను కేవలం రూపాయిలమానంలోనే లెక్కకట్టడం ఆమెసౌహార్దానికి పరమఅపచారం చేయడం అనిపిస్తుంది.

అంతసేపూ శ్రద్ధగా విన్న మా బావమరది మరి ఉండబట్టక, "ముందు ఆమె ఎవరో ఏమిటో మాకు చెప్పకుండా, అలా అల్లుకొనిపోతూంటే, మమ్మల్ని ఆమెను ఏవిధంగా అర్థం చేసుకోమన్నట్లు? ఆమె మానవలోకంలోని మామూలుమనిషా? లేక స్వర్గలోకమునుండి వేళకు దిగివచ్చిన దేవతా? లేక, ఊహాలోకంలోని ఊర్వశా? ఎవరనీ నిర్ణయించేదిరా అన్నంత సందేహంలో మమ్మల్ని ఉంచేస్తే ఎలాగ? అసలు కథకుడు కానివాడు పెద్దఎత్తున కథ చెప్పడం మొదలుపెడితే వచ్చే అనర్థమే ఇది" అన్నాడు.

మామూలుగా అయితే అటువంటి వాదనసావకాశాన్ని నేను తేలికగా పోనిచ్చేవాణ్ణి కాను, గాని ముందుగా నా చెప్పే సంగతి పూర్తి కాకుండా వాదనలోకి దిగాలనిపించలేదు. "అవునయ్యా, నే నెలాగూ నీలాగ కథకుణ్ణని చెప్పుకోవడంలేదు. కాక ముందుగా ఏది అత్యంత ముఖ్యమయిన విషయం అయితే, దాన్నే పరిశీలించడం మా డాక్టర్ల లక్షణం" అన్నాను.

అంతలో మావిడ కథ పక్కదారి తొక్కుతున్నదేమోనని అనుమానించి, "అయితే తరవాత ఏమి అయింది చెప్పరూ, అందులో గాని డబ్బు అనుకొన్నంతా లేదా ఏమిటి" అంది.

అబ్బే అటువంటి దేం లేదు. అంతా సరిగానే ఉంది. కాని, ఆమె ఎవరన్న సంగతి కదూ ఇంతవరకు చెప్పలేదు.

ఆ యింట్లో ఒక భాగంలో కుటుంబయ్యగా రని, ఒక ప్లీడరుగుమాస్తా ఉండేవాడు. వాళ్ల ప్లీడరుఆర్జనకంటె ఆయనఆర్జనే ఎక్కువగా ఉండేదిట. కాని, అందులో మూడువంతుల ముప్పాతిక తన వ్యసనాలకే ఖర్చుపెట్టేసేవాడనే వారు. ఆయన ఎటువంటివాడయితేనేం. వాళ్ల పెద్దమ్మాయి పేరు శాంతి. ఆమెను నేను అదివరకు చూడకపోలేదు. కాని, ఆ చూడడం వేరు, ఆ తెల్లవారుజామున చూడడం వేరు.

ఆమె నాకంటె వయస్సులో ఒకటి రెండేళ్లు చిన్నయి ఉండవచ్చునుకాని, పెద్దన్నట్లుగానే కనబడేది. నేను అప్పటికి పదహారున్నరసంవత్సరాలవయస్సున్నా బాగా పెరగకపోవడంవల్లనూ, ఆమె పరికిణీ పల్లెవాటు కూడా మానేసి చీరలే కట్టుకొంటూ ఉండడం వల్లనూ.

తరవాత కొన్నాళ్లు ఏమో నాకే తెలియని వింతకదలిక. నా కృతజ్ఞతను ఏయేరీతుల ఎంత ఉదాత్తంగా ప్రదర్శించాలీ అన్న ఆలోచనతో, ఎన్ని పగటికలలు కన్నానో లెక్కలేదు.

ఎల్లప్పుడూ ఆమెను చూడాలనే ఉండేది, మాట్లాడ్డం ఎలాగూ సాధ్యంకాదుగనక. కాక మేమిద్దరమూ తారసపడినప్పుడు దగ్గర ఎవ్వరూ లేకపోయినాసరే, నిబ్బరంగా ఆమెకళ్లలోకి చూడడానికి సాహసం చాలేదికాదు.

తరవాత మా చిన్నాన్న తేరుకొని డబ్బు పంపేవేళకు ఆమె అత్తవారింటికి వెళ్లిపోయింది. ఇప్పుడంటే ఇంత తేలికగా అనేస్తున్నాను గాని, అప్పుడు ఎవర్నీ అడక్కుండా ఆ విషయం తెలుసుకొందికి ఎంత అవస్థపడ్డానో, తెలుసుకొన్న తరవాత, అరరే ఆమెకు నా కృతజ్ఞతను తెలపలేకపోవడమే కాదు, అధమం ఋణంఅయినా తీర్చుకోలేకపోయేనే అని ఎంత తపించేనో ఇప్పుడు నాకూ సరిగా ఊహకు అందదు. అప్పుడదొక జీవితంలోని అతి ముఖ్యమయిన సమస్య.

తరవాత నాకు ఉన్న అతిఅమూల్యమయిన వస్తువులలో ఒకటి అన్నంత భద్రంగా ఆ డబ్బాను నా పెట్టెలో దాచిఉంచేవాణ్ణి. ఒకమారు నా బట్టలూ అవీ సర్దడంలో ఈవిడే (శారద) తీసిపారేసిందట. అవేళే చెప్పాలనుకొన్నాను గాని, అవతల ఏదో తొందర కేసు ఉండి వెళ్లిపోవలసివచ్చింది.

ఆవెనుక అదివరకు ఏడెనిమిదిసంవత్సరాలుగా సాగిన దావా మా చిన్నాన్నకి చాలా అనుకూలంగా పరిష్కారం కావడంతో నేను హుషారుగా యమ్. బి. బి. యస్ చదువుకుందికి వెళ్లిపోడానికి వీలుకలిగింది.

చదువు పూర్తయినతరవాత ఈ ఊళ్లోనే ప్రాక్టీసు పెట్టేను.

ఆరంభించి అప్పటికి ఒక పదినెలలకంటె ఎక్కువ కాలేదు. ప్రాక్టీసు ఏదో ఒకమాదిరిగా ఉంటున్నా అంత మరి ప్రోత్సాహకరంగా లేదు. తీరికగంటలంటూ చాలా ఉండేవి.

ఆరోజు పూర్ణిమ. అప్పుడే ఉదయించిన చంద్రబింబం చెట్లసాటునుంచి, ఇంకా ఎరుపు ధాతువుతోనే కనిపిస్తున్నది. ఒంటరిగా డాబామీద కూర్చొని, ప్రపంచంగురించి, దేశం గురించి, నాగురించి, సంఘంగురించి కలగాపులగంగా ఆలోచిస్తున్నాను.

అంతలో కిందనుంచి పిలుపు వినవచ్చింది. నౌకరుకుఱ్ఱవాడితో మేడమీదకు తీసుకొని రమ్మన్నాను. వచ్చిన మనిషి కుటుంబయ్యగారే; చూపిన కుర్చీమీద కూర్చోకుండానే దండకం చదివినట్లుగా అందుకున్నాడు. "అప్పుడు తమరు మేమున్న ఇంట్లోనే ఉండి చదువుకొని, ఇంతవారవడం చాలా సంతోషం. తమ దర్శనం చెయ్యాలనుకొంటూ ఉండడం ఎప్పటికప్పుడే తీరికలేకపోతూ ఉండడమున్నూ. మరి కూర్చొందికి నాకు వీలులేదు. మా శాంతమ్మకి ఒళ్లెరగని జ్వరం. నాలుగయిదురోజులు అదే పోతుందని ఊరుకున్నాము. తరవాత కొయినా (క్వినైను) మాత్రలు వేసినా తగ్గలేదు. ఏమిటో భయంగా ఉంది బాబూ, ఇంతవరకూ జ్వరం తిరుగుముఖానికి రాలేదు. తమరు ఒక్కమారు దయచేస్తే" అన్నాడు.

ఈ మాటలు వినడంతో అతనికంటె నాకే తొందర ఎక్కువయింది. ఏమాత్రమయినా ఉపయోగిస్తాయని తోచిన మందులన్నీ పట్టుకొని, జట్కాలో బయలుదేరేము.

జబ్బుగురించిన లక్షణాలే దారి పొడుగునా కుటుంబరావుగారిని అడిగేను. ఆయనా అవే చెప్పేడు, అంతే. కాని, వెళ్ళి ఆమెమంచం పక్కను కుర్చీలో కూర్చునేవరకూ ఆమె వితంతువు అన్న సంగతి తెలీదు. డాక్టరుగా నా కనవసరమయిన అంశంమీద నా మనస్సు లగ్నం కావడం నాకే చిన్నతనంగా తోచింది. ఎవరయితేనేం, ఆమెకు నేను ఋణపడిఉన్నాను. నాచేతనయినంతగా పరిశ్రమించి ఆమెకు ఆరోగ్యం చేకూర్చడం నా విధి అనుకొని పరీక్ష ప్రారంభించేను. కుటుంబయ్యగారు చెప్పినంత ప్రమాదంగా కాకపోయినా, జ్వరం చాలా ఎక్కువగానే ఉంది. టైఫాయి డనడానికి ఏమీ సందేహంలేదు. కాని, బైటివాళ్లు చెప్పే మాటలు కీలగా అర్థంఅవుతున్నాయి.

నేను నా పరీక్ష ముగించి ధర్మామీటరూ చేతులూ కడుక్కొందికి నడివాకిలిలోకి వచ్చేను.

ఎదురుగా డాబా కనిపించింది. ఊహూఁ, కనిపించింది డాబామాత్రమే కాదు, ఆ వెన్నెలలో పడకకుర్చీలో నేను పడుకొనిఉండడమూ, ఆమె ఎట్టఎదురుగా దేవతామూర్తివలె నిలబడిఉండడమూ అతిస్పష్టంగా కనిపించింది. ఆహా, ఆ దివ్యసౌందర్యానికీ, ఈ మంచంమీద దుర్బలంగా పడిఉన్న ఆకృతికీ ఏమి సంబంధం? ఒక్క ఆరు సంవత్సరాలలో అంత మార్పు రావడానికి వీలుందని ఎవళ్లయినా అంటే, నా కళ్లతో నేను చూడకపోతే నమ్మలేకపోయేవాడిని అనుకొన్నాను.

నన్ను పిలవడంతో కుటుంబయ్యగారి పని చాలా తేలికపడిఉంటుంది. ఏమంటే వాళ్లందరూ తీసుకోవలసిన శ్రద్ధ అంతా నేనే తీసుకొంటూ, ఇదేదో నేను డబ్బు పుచ్చుకుని కుదర్చవలసిన జబ్బు అనికాక, నాకే సంబంధించిన జీవన మరణసమస్య అన్నట్లుగా తాపత్రయపడసాగాను. కుటుంబయ్యగారూ వాళ్లూ ఏమో ప్రాక్టీసు బాగా లేదుకాబోలు. అంచేత గట్టిగా శాయశక్తులా పనిచేసి ఒకటి రెండు చోట్ల నయంచేస్తే, పేరువస్తుం దని పని చేస్తున్నానని నా విపరీతమయిన శ్రద్ధకు అర్థం చెప్పుకొని ఉంటారు. కాని, ఆ సందర్భంలోమాత్రం, పేరు రాకపోతే మానిపోయెను. అపకీర్తి వచ్చినా బాధ లేదు. ఆమెకి ఆరోగ్యం చేకూరితే అంతే చాలు ననిపించింది. అందుకు మనం శాస్త్రీయంగానూ, సామాన్యదృష్టితోనూ ఎన్నెన్నో కారణాలు చెప్పుకోవచ్చునుగాని, అసలు పరిస్థితి మాత్రం అది.

మరేం ప్రమాదకరమయిన లక్షణాలు లేవు, నేనే నయంచేయగల నన్న నమ్మకం ఉండినప్పటికీ, ఏమో నేను పొరబడుతున్నానేమో, ఇటువంటి సందర్భాలలో నా అహంభావం కోసం పాకులాడడం మంచిది కాదని అప్పటిలో ఊరంతటికి ప్రసిద్ధుడయిన డాక్టరు శ్యామలరావుగారిని నాతోంతట నేను తీసుకొని వెళ్ళేను.

నాకయితే ఎంత స్వల్పంగానయినా కట్నం ముట్టచెప్పి, తక్కినదంతా కృతజ్ఞతావాక్యాల రూపేణ చెల్లించవచ్చునన్న కుటుంబయ్యగారికి, డాక్టరు శ్యామలరావుగారి రాక ఒకవిధంగా ఇష్టమే అయినా ఇంకొకవిధంగా గాభరాకి కారణమయింది. కాని, ఆయనను అట్టేసేపు ఆ స్థితిలో ఉంచకుండా, "డాక్టరుగారి బిల్లు సంగతి మీకేం భయంలేదు. అదంతా నేను స్వయంగా చూసుకొంటాను. అంటే, అసలు, ఇటువంటి సందర్భంలో మే మిదివరకు చదివి చదివి ఎంత తెలుసుకున్నా వారి అనుభవంనుండి నేర్చుకోవలసినవికూడా చాలా సంగతు లుంటాయి. అందుకోసమే ఆయనను తీసుకొని వచ్చేను. ఆయనా, నేను అభిప్రాయపడ్డట్టే అభిప్రాయపడుతున్నారు. మరొక్క అయిదారు రోజులు ఈవిధంగానే ఉండవచ్చును. కాని క్రమంగా తగ్గుతుంది. మరేం పర్వాలేదు" అన్నాను.

అనుకొన్నట్లుగానే, కాదు, ఆశించినట్లుగానే ప్రమాదపు రోజులు గడిచిపోయాయి. రోగం తిరుగుముఖం పట్టింది.

ఆ రోజు ఉదయం ఆమె నన్ను విస్పష్టంగా గుర్తించిం దనడానికి ఎట్టి సందేహమూ లేదు. ఆ కన్నుల కదలిక ఇప్పటికీ నాకు కన్నుమూసుకొంటే స్పష్టంగా కనిపిస్తుంది

అదివరకు రోజుకి కొన్నిగంటలు ఆమె మంచంప్రక్కనే కూర్చొనేవాడిని, ఆతరవాత ఏదో చిత్రమయిన మొగమాటాన్ని అనుభవించసాగాను.

రోజు రోజుకీ ఆమెపరిస్థితి బాగుపడుతున్నకొద్దీ, నేను కనే కలల సంఖ్యకూడా అతిగా వృద్ధిపొందసాగింది. కొన్ని పగటికలలు, కొన్ని రాత్రికలలు.

ఆమెను నేను పెళ్లి చేసుకొందికి ఎన్నెన్నో అవాంతరాలు ఏర్పడినట్లు, బాగా కావలసిన బంధుమిత్రులంతా వద్దని చెప్పినట్లు, ఇందరినీ అలక్ష్యంచేసి పెళ్లిచేసుకొన్నట్లు, ఆమె ఏవో కారణాలు చెప్పి తనకు ఇష్టంలేదంటే, ఎన్నో విధాల నచ్చజెప్పి చిట్టచివరకి ఒప్పించినట్లు, ఇద్దరం కలిసి అలా ఒకరి చెయ్యి ఒకరు పట్టుకొని ఏసాధనం లేకుండానే గాలిలో తేలిపోయినట్లు, అలా అలా ఏవో అడవులూ, కొండలూ దాటి వెళ్లిపోతూండగా, అకస్మాత్తుగా ఒకరు ఏ అగాధమయిన లోయలోనికో పడిపోతూ ఉంటే రెండవవారు చేయూతనిచ్చి రక్షించినట్లు... ఓ ఒకటేమిటి, ఎన్నెన్ని రకాలుగానో కలలు.

అయితే కలలరూపంగానయినా సంతోషం ఒక పదిరోజులకంటె ఎక్కువ నిలవలేదు.

ఆవేళ ఉదయం నే నింటిదగ్గర లేనప్పుడు కబురు వచ్చిందిట వ్యాధి తిరగబెట్టిం దని. నేను తెలుసుకొని వెళ్లేసరికి శ్యామలరావుగారు వచ్చి ఉన్నారు. ఆయన అట్టే ఆశ లే దంటూ ఉన్నా, చిట్టచివరివరకూ అంత సమీపంలోనే మృతి కాచుకొని ఉందని నే ననుకోలేకపోయేను. ఆరాత్రి పదకొండుగంటలతో సమాప్తమయిపోయింది.

ఆరాత్రే కాదు, తరవాత చాలా రాత్రులు నిద్ర సరిగా ఎరగను. అయితే ఆరకంగా ఒకరితో చెప్పుకోలేకుండా విచారించడంవల్ల నా శరీరాన్ని చెరుపుకోవడంకంటె మరేమీ చేసేదిలేదన్న వ్యావహారికజ్ఞానంతో, తరవాత మామూలుమనిషి నయి పెళ్ళికి సిద్ధపడ్డాను.

అయితే ఇంతకీ చెప్పవచ్చే దేమిటంటే, తరవాత కొంతకాలం ఎంత ముఖ్యమయిన కేసులున్నా సరే, ఆవీధిలోంచి వెళ్ళడం అంటేనే బాధగా ఉండేది. ఇటీవల ఎంత మొరటుదేరిపోయినా, ఆ యింటిని తేరిపారి చూస్తే మాత్రం కళ్లంట నీళ్లు వచ్చేస్తాయి. ఇక లోపలికి వెళ్ళి ఆ డాబా అగదులూ చూస్తే బిగ్గరగా ఏడ్చేస్తానేమో!

సరే, ఇక నీయిష్టం, మీ చెల్లెలుఇష్టం... తరవాత ఆలోచిద్దాముగాని, లే, పోయి ఏదైనా సినీమా చూసివద్దాం - అంటూ లేచేను కుర్చీలోంచి.

---

ఉత్తమ శైవమత గ్రంథము

**పండితారాధ్యచరిత్ర**

వెల రు. 5/-

(ప్యాకింగు, పోస్టేజి రు. 1-4-0)

**మేనేజరు, ఆంధ్రగ్రంథమాల**